క్లుప్తంగా

డిప్యూటీ తహసీల్దార్లుగా మాధురి, చంద్రశేఖర్


వి.మాధురి


ఎం.చంద్రశేఖర్

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండల డిప్యూటీ తహసీల్దార్లు(డీటీ)గా వి.మాధురి, ఎం.చంద్రశేఖర్‌లు బాధ్యతలు స్వీకరించారు. మాధురి కొత్తపేట ఆర్డీవో కార్యాలయం నుంచి బదిలీపై రాగా, చంద్రశేఖర్ రాయవరం మండలం నుంచి బదిలీపై ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతల్లో చేరారు. వారికి కార్యాలయ సిబ్బంది, మండల వీఆర్‌ఓలు స్వాగతం పలికారు.

రేపు జాబ్ మేళా

రామచంద్రపురం: జిల్లా ఉపాధి కార్యాలయం, స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రముఖ ప్రైవేటు కంపెనీల్లో పని చేసేందుకు బుధవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి యు.వసంతలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 10.30 గంటల నుంచి జరిగే ఈ జాబ్ మేళాకు ఆసక్తి గల పురుష మహిళా అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, బయోడేటా, జెరాక్స్ కాపీలతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 8247645389 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే జరిమానా

మండపేట: పట్టణంలో ప్లాస్టిక్ వినియోగిస్తే జరిమానా విధిస్తామని కమిషనర్ రంగారావు తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది, సచివాలయ సిబ్బందితో పట్టణంలో తనిఖీలు చేపట్టారు. చిరువ్యాపారులు, తోపుడు బండ్లు, మార్కెట్ లోపల, కిరాణా దుకాణాలు, స్వీట్ షాపులు, హోటళ్లలో తనిఖీ చేశారు. ప్లాస్టిక్ కవర్లు వాడుతున్న వ్యాపారులకు జరిమానాలు విధించారు. కల్యాణ మండపాల్లో కూడా ప్లాస్టిక్ గ్లాసులు గానీ, టేబుల్ క్లాత్‌లు గానీ వాడరాదన్నారు. ప్రజలంతా ప్లాస్టిక్ కవర్లకు బదులుగా గుడ్డ సంచులు మాత్రమే వినియోగించాలని ఆయన కోరారు.

ఉపాధి హామీ పనులకు భూమి పూజ


జెడ్ మేడపాడులో పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

మండపేట: పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల పేరిట చేపట్టిన గ్రామీణ ఉపాధిహామీ పనులకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సోమవారం భూమిపూజ చేశారు. మండలంలోని మారేడుబాక, తాపేశ్వరం, ఇప్పనపాడు, జెడ్ మేడపాడు, ద్వారపూడి గ్రామాల్లో చేపట్టే పనులకు ఆయన కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో ఈ పనులు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కే సత్యనారాయణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అభివృద్ధిపై దృష్టి పెట్టామన్నారు. పల్లె పండుగ పేరుతో గ్రామాలు అభివృద్ధి బాట పట్టిస్తామన్నారు. మండలంలోని మొత్తం గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం నిధులు రూ 2.50 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ, ఎంపీటీసీ దేవప్రసాద్ నాయుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారుల ఫోన్ నంబర్లు

రాయవరం మండలం

తహసీల్దారు	9849903905
ఎంపీడీవో	9912191666
మండల విద్యాశాఖాధికారి1	9948523380
మండల విద్యాశాఖాధికారి2	7013074928
పోలీసు స్టేషన్	08857235333
సబ్‌ఇన్‌స్పెక్టరు	9440904843
రాయవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు	8309351543, 7013003149
మాచవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు	8501002004, 8639015670
మండల వ్యవసాయాధికారి	8886613579
జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీవో	7702072648
డ్వాక్రా ఏపీఎం	9154081283
మండల ఇంజినీరింగ్ అధికారి	9502377535
విద్యుత్‌శాఖ ఏఈ	9440812651
హౌసింగ్ ఏఈ	7093930489
మండల పశువైద్యాధికారి	8074154935
ఉద్యానవన శాఖ అధికారి	8712625211
గ్రామీణ నీటి పారుదల శాఖ ఏఈ	9100121182

పేర్లు మార్చి.. ప్రజలను ఏమార్చుతూ..

- సంక్షేమానికి తూట్లు పొడుస్తున్న ప్రభుత్వం
- జగన్ సంక్షేమ గుర్తులను చెరిపేసే పన్నాగం
- ఒక్క రేషన్ కార్డూ మంజూరుకాని వైనం
- అందని రీయింబర్స్‌మెంట్
- జగనే నయం అంటున్న సామాన్య ప్రజానీకం


కేదారిలంకలో సీఎం జగన్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేరు ఉన్న శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన దృశ్యం (ఫైల్)


వైఎస్ జగన్ హయాంలో టేకిలో అరగంటలో రేషన్ కార్డును అందిస్తున్న ఉద్యోగులు (ఫైల్)

కపిలేశ్వరపురం: పాలన అంటే గిర్రున తిరిగే కుర్చీలో కూర్చుని పెత్తనం చెలాయించేది కాదు. కుల, మత, రాజకీయ, ప్రభావాలను రేకెత్తించి అధికారాన్ని చేపట్టడమూ కాదు. అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని ఓడించేందుకు ఆచరణ సాధ్యంకాని హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చాకా ఆర్థిక లెక్కలు సాకు చూపి తప్పించుకోవడం అస్సలే కాదు. పాలన అంటే ఎన్ని కష్టాలున్నా, ఎంత భారమైనా పేద, మధ్యతరగతి ప్రజలు కోసం సంక్షేమాన్ని అమలు చేయడమే. అందుకు కావాల్సిన నిధులను సమకూర్చుకునే దిశగా అభివృద్ధి వైపు అడుగులు వేయడమూ.. దయనీయ స్థితిలో ఉన్న అన్ని రంగాల ప్రజలకు తక్షణ సాయమందించి చేదోడు వాదోడుగా నిలవడం. అదే చేసింది గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. 2019–24 మధ్య పాలనలో సంక్షేమ క్యాలెండర్‌ను ప్రకటించి క్రమం తప్పకుండా ప్రజలకు ఆర్థిక సాయమందించడాన్ని స్పష్టంగా చూడొచ్చు. అలా సాయం చేయడం వల్ల రాష్ట్రం అప్పులు పాలైపోతుందని, ప్రజలు సోమరులుగా మారిపోతున్నారంటూ అప్పటి ప్రతిపక్ష పార్టీలు గగ్గోలుపెట్టాయి. ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తున్న వైఎస్ జగన్ ప్రభుత్వాన్ని ఓడించేందుకు కూటమి పార్టీలు లేనిపోని అభాండాలు వేసి విజయం సాధించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగునెలలైనా ఫీజు రీయింబర్సుమెంటు, రైతు భరోసాలో రాష్ట్ర ప్రభుత్వ వాటా సొమ్ములేదు. ప్రస్తుతం ప్రజలకు సంక్షేమం అందడంలేదు.

సంక్షేమానికి తూట్లు పొడుస్తున్న సంపద సృష్టికర్త

ఎన్నికల ప్రచారంలో సంపద సృష్టికర్తనని చెప్పుకున్న సీఎం చంద్రబాబు నేడు అధికారంలోకి వచ్చాకా సంక్షేమాన్ని అమలు చేయడానికి ఖజానా ఖాళీ అంటున్నారు. కూటమి హామీలకు నాదీ హామీ అని చెప్పిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మిన్నకుంటున్నారు. అన్నదాతా సుఖీభవ పథకంలో సాయం కోసం మండపేట నియోజకవర్గంలో 22,369 మంది, రామచంద్రపురం నియోజకవర్గంలో 19,659 మంది రైతులు ఎదురు చూస్తున్నారు. వారికి ఏడాదికి సుమారు రూ.84,05,60,000 సాయమందించాల్సి ఉంది. తల్లికి వందనం పథకం ద్వారా మండపేటలో 21,441, మంది, రామచంద్రపురం నియోజకవర్గంలో 13,690 మంది తల్లులకు ఏడాదికి రూ.52,69,65,000 సాయం అందించాల్సి ఉంది. ఇలాంటి సాయమేమీ అందుకోలేక పోతున్న ప్రజలు సీఎం జగన్ పాలనను గుర్తు చేసుకుంటున్నారు. సంక్షేమ క్యాలెండర్ ప్రకటించి చెప్పిన తేదీలకల్లా సాయం సొమ్మును పారదర్శకంగా లబ్ధిదారుని ఖాతాకు జమ చేసిన ఘనత జగన్ పాలనదేనంటున్నారు. దాని నుంచి ప్రజలను ఏమార్చేందుకు జగన్ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల సందర్భంగా ఆవిష్కరించిన శిలాఫలకాలను ధ్వంసం చేసిన ఘటనలు మండపేట నియోజకవర్గంలో జరిగాయి.

పథకాల పేర్లు మార్పుతో ఏ మార్పు..

సామాన్య ప్రజలకు మేలు చేసే క్రమంలో వైఎస్ జగన్ పాలనా కాలంలో అమలు చేసిన పథకాలు ప్రజల్లో నాటుకుపోయాయి. వాటి అమలు కోసం నెలకొల్పిన వలంటీర్, సచివాలయ వ్యవస్థలకు దేశ వ్యాప్తంగా గుర్తింపునిచ్చాయి. సంక్షేమమంటే జగన్ అన్న పేరు చిరస్థాయిలో నిలిచిపోయే స్థాయికి ఎగబాకింది. కారణాలేమైనా ప్రభుత్వం మారింది. వైఎస్ జగన్ సంక్షేమ సారానికి చిహ్నాలను చెరిపేసేందుకు కొందరు కుట్రలు పన్నారు. ఆయన హయాంలో ప్రారంభించిన సంక్షేమ పథకాల పేర్లు మార్చేశారు. జగనన్న అమ్మఒడి పథకం పేరును తల్లికి వందనంగా మార్చారు. రైతు భరోసా కేంద్రాలు– రైతు సేవా కేంద్రాలుగానూ, వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ – అన్నదాత సుఖీభవగానూ, వైఎస్సార్ సున్నా వడ్డీ, పంట రుణాలు–వడ్డీలేని రుణాలుగానూ, వైఎస్సార్ యంత్రా సేవా పథకం–ఫార్మ్ మిషనైజేషన్ స్కీమ్‌గానూ, వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రాలు– విలేజ్, క్లస్టర్ సీహెచ్‌సీఎస్ గానూ, వైఎస్సార్ యాప్ – వీఏఏ ఫెర్మారెన్స్ మొనటరింగ్ యాప్‌గానూ, జగనన్న తోడు పథకాన్ని చిరు వ్యాపారులకు సున్నా వడ్డీ రుణాలు గానూ మార్చేసింది.

అక్కసుతో శిలాఫలకాల ధ్వంసం

గ్రామ గ్రామాన ప్రభుత్వం తాలూకు వ్యవస్థలను బలోపేతం చేసే దిశగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేసింది. మునుపెన్నడూ లేని విధంగా ప్రభుత్వ భవనాలను నిర్మించింది. అధికారంలోకి వచ్చిన మూడు నెలలకే నాటి జగన్ తాలూకు సంక్షేమ సాక్ష్యాలు ఉండకూడదన్న అక్కసుతో శిలాఫలకాలను ధ్వంసం చేశారు. కపిలేశ్వరపురం మండలం నల్లూరులో ఈ నెల 9న, కేదారిలంకలో జూన్ 30న ఈ దుశ్చర్యలకు పాల్పడ్డారు. మండపేట పట్టణంలోని రెండు వార్డుల పరిధిలోని శిలాఫలకాలను ధ్వంసం చేశారు.

మంచి చేసి నిరూపించుకోవాలి



ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు సహజంగా మారుతుంటాయి. ప్రభుత్వం మారింది అంటే గత ప్రభుత్వంకంటే మరింత మేలు చేసే దిశగా అడుగులు వేస్తుందని అర్థం. కానీ కూటమి ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేసే దిశగా పాలనను సాగిస్తుంది. అందుకు ఖర్చును సాకుగా చూపిస్తుంది. ఎన్నికల సమయాల్లో హామీలు ఇచ్చినప్పుడు లెక్కలు వేసుకుని హామీలివ్వాలన్నదాన్ని విస్మరించారు.

– పలివెల మధు, మండల పరిషత్ వైఎస్సార్ సీపీ విప్, కపిలేశ్వరపురం

లక్కూ... కిక్కూ...



- సిండికేట్ల ఆశలు అడియాసలు
- భారీగా వేసిన వారికి దక్కని లిక్కర్ షాపులు
- రేపటి నుంచి కొత్త షాపుల్లో మద్యం అమ్మకాలు

రామచంద్రపురం: లాటరీ ముగిసింది. ఎన్నో ఆశలు పెట్టుకున్న సిండికేట్లకు చివరకు నిరాశే మిగిలింది. భారీగా డీడీలు తీసి షాపులకు కోసం వేసిన వారికి ఒక్క షాపు కూడా దక్కకపోవటంతో మద్యం షాపులు పెట్టి ఆదాయాన్ని సంపాదించాలనే ఆశలకు గండి పడింది. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో కూటమికి చెందిన నేతలు భారీగానే షాపులపై ఆశలు పెట్టుకుని డీడీలు తీశారు. కూటమికి చెందిన కొంత మంది నేతలు మూడు నాలుగు గ్రూపులుగా ఏర్పడి 10 నుంచి 20 వరకు వరకు ఒక్కో సిండికేట్‌గా ఏర్పడి 25 నుంచి 75 షాపుల వరకు డీడీలు తీసి దరఖాస్తులు వేశారు. ఇలా రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాలతో పాటుగా పక్కనున్న మండలాలకు చెందిన షాపులకు కూడా రూ.2 లక్షల డీడీలు తీసి వేశారు. ఒక్కో సిండికేట్ రూ.కోటి నుంచి రూ.3 కోట్ల వరకు రూ.2 లక్షల డీడీలు తీసి షాపుల కోసం దరఖాస్తు చేశారు. చివరకు భారీ సిండికేట్లకు అనుకున్నంత మేర షాపులు రాలేదు. రామచంద్రపురం నియోజకవర్గానికి చెందిన కూటమి నేతలు ఒక సిండికేట్‌గా ఏర్పాటై 58 షాపులకు దరఖాస్తులు వేశారు. కానీ వారికి ఒక్క షాపు కూడా దక్కలేదు. మరో సిండికేట్‌కు చెందిన నేతలు 38 షాపులకు వేయగా వారికి కేవలం 2 షాపులు మాత్రమే లాటరీలో తగిలాయి. భారీగా డీడీలు తీసిన వారికి దక్కక పోగా వస్తే వస్తుందని, అదృష్టం పరీక్షించుకున్న కొంత మందికి ఒక్క డీడీకే షాపును కూడా కాజులూరు మండలంలో ఇద్దరు నేతలు దక్కించుకున్న వైనం. రామచంద్రపురం పట్టణంలో అయిదుగురు కలసి మూడు షాపులకు దరఖాస్తులు వేయగా వారికి ఒక షాపు తగలింది. ఇలా మొత్తం మీద భారీగా అంచనాలు వేసిన వారికి చివరకు ఒక్క షాపు కూడా దక్కకపోవటంతో మద్యం షాపుల ద్వారా వ్యాపారం చేద్దామనుకున్న వారికి నిరాశే మిగిలింది.

అంతా ఒకటవుదాం..

ఎవరికి ఏ షాపు దక్కినా అందరం కలిసే వ్యాపారం చేసుకుందామంటూ ఇప్పటి నుంచి మద్యం షాపుల సిండికేట్లు సంప్రదింపులు మొదలెట్టేశారు. ఇప్పటివరకు టెండర్లు వేసేందుకు సిండికేట్లుగా మారగా లాటరీలు ముగిశాక మండలాల వారీగా, పట్టణాల వారిగా సిండికేట్లుగా మారేందుకు సమావేశాలను ఏర్పాటు చేసే దిశగా ప్రయత్నాలు మొదలెట్టేశారు. అందరూ ఒక సిండికేట్‌గా ఏర్పడి అమ్మకాలు చేస్తేనే కానీ మిగిలేది లేదంటూ షాపులు దక్కించుకున్న వారు, సిండికేట్ లీడర్లు నేడు సమావేశాలను నిర్వంచేందుకు ఆయా మండలాల్లో ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా రూ.2 లక్షలు డీడీలు తీసి సింగిల్‌గా లాటరీలో షాపులను దక్కించుకున్నవారిని ప్రసన్నం చేసుకుని అందరినీ కలిపేసుకునే పనిలో నాయకులు నిమగ్నమయ్యారు.

పెంచుతున్న షాపుల అద్దెలు

లాటరీలు పూర్తి కావటంతో షాపులకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. మద్యం బిజినెస్ అధికంగా జరిగే సెంటర్లలో షాపుల కోసం పట్టుపడుతుండటంతో రూ.20 వేల నుంచి 30 వేల వరకు అద్దెలు పెంచేశారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో షాపుల కోసం ఎగబడుతున్నారు. ఇప్పటికే అందుబాటులో ఉండే షాపుల కోసం విపరీతమైన ప్రయత్నాలు చేస్తున్నారు. ఫలానా షాపు ఎవరిది వారు ఎవరు ఎంత ఇస్తే షాపును అద్దెకు ఇస్తారు. అనే ఆరాలు తీస్తున్నారు. వారికి కావాల్సిన షాపులో ఇప్పటివరకు ఎవరైనా వివిధ వ్యాపారాలు ఉంటే వారికి అధిక మొత్తంలో డబ్బులు ఇచ్చి ఖాళీ చేయించే ప్రయత్నాలు కూడా మొదలెట్టేశారు.

అల్పపీడనం.. గుండెల్లో కలవరం

- ఈనిక, పాలుపోసుకునే దశలో వరి పైరు
- ఆందోళనలో అన్నదాతలు


వరి పంట

రాయవరం: ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికందనున్న తరుణంలో వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ప్రస్తుతం వరి పైరు గింజ గట్టిపడే దశలో ఉంది. ఇటువంటి సమయంలో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రైతన్నలను కలవర పరుస్తోంది. వరి పంట తుది దశకు చేరుకుంటున్న సమయంలో అల్పపీడనం కారణంగా భారీ వర్షాలు కురిస్తే పంట నేలనంటే ప్రమాదం ఉంది.

1.01 లక్షల ఎకరాల్లో..

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని రాయవరం, కపిలేశ్వరపురం, మండపేట, కె.గంగవరం, కాజులూరు, రామచంద్రపురం మండలాల్లో 1.01లక్షల ఎకరాల్లో ఖరీఫ్ వరిసాగును రైతులు చేపట్టారు. జూలైలో నియోజకవర్గంలో వరినాట్లు పూర్తయ్యాయి. ప్రస్తుతం వరిపైరు అధిక శాతం ఈనిక దశలో ఉంది. ముందుగా వరినాట్లు జరిగిన చోట పంట పాలుపోసుకునే దశలో ఉంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో తెగుళ్ల బెడద అధికంగా ఉంది. ముఖ్యంగా ఎండాకు తెగులు ఎక్కువగా ఉంది. ఒక పక్క తెగుళ్ల బెడదతో రైతులు ఇబ్బందులు పడుతున్న తరుణంలో బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం రైతన్నల గుండెల్లో వాయుగుండంగా మారుతోంది.

ఆందోళనలో రైతాంగం

ప్రస్తుత దశలో వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు అన్నదాతలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఈశాన్య రుతు పవనాలు ప్రవేశించే తరుణంలో అల్పపీడన ప్రభావంతో వాతావరణంలో వస్తున్న మార్పులు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. క్లస్టర్ పరిధిలోని ఆరు మండలాల్లో రైతులు రైతులు పదే పదే ఆకాశం వైపు, పంట వైపు చూస్తున్నారు. సోమవారం నుంచి వర్షాలు కురవడం ప్రారంభించాయి. పంట చేతికందే సమయంలో వర్షాలు కురిస్తే నష్టం తప్పదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

తడిసి మోపెడు..

అధిక శాతం విస్తీర్ణంలో రైతులు స్వర్ణ రకాన్ని సాగు చేశారు. స్వర్ణ రకం వరి కొద్దిపాటి గాలులకే నేలనంటుతుంది. గింజ గట్టిపడే దశలో నేలనంటితే ఆ వరిని తిరిగి కట్టలు కట్టి నిలబెట్టేందుకు రైతులకు అదనపు ఖర్చవుతుంది. పంట చేతికంది వచ్చే సమయంలో తుఫాన్లు, భారీ వర్షాలు కురిస్తే ఖర్చులు తడిసి మోపుడవుతాయన్న భయం రైతులను వేధిస్తోంది. గతంలో వచ్చిన నీలం, జల్, హుదూద్ తదితర తుపాన్ల కారణంగా ఏర్పడ్డ నష్టాలను గుర్తు చేసుకుని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రైతులకు అందుబాటులో ఉంటాం



తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులకు వ్యవసాయ శాఖ నిత్యం అందుబాటులో ఉంటుంది. అవసరమైన సూచనలు, సలహాలు అందజేస్తాం. ప్రస్తుతం వరి పంట ఈనిక, పాలు పోసుకునే దశలో ఉంది. ఈ సమయంలో భారీ వర్షాలు, గాలులకు వరి పంట నేలకొరిగే ప్రమాదముంది.

– కొప్పిశెట్టి ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, రాయవరం

పోస్టాఫీసు సేవలు ప్రారంభం


నూతన కార్యాలయాన్ని పరిశీలిస్తున్న సూపరింటెండెంట్

మండపేట: నూతనంగా ఆంధ్రాబ్యాంక్ వీధిలో ఏర్పాటు చేసిన పోస్టాఫీసు నుంచి ప్రజలందరూ యథావిధిగా వినియోగించుకోవాలని రాజమహేంద్రవరం డివిజన్ సూపరింటెండెంట్ కె.శేషారావు కోరారు. మండపేట మెయిన్‌రోడ్డులో ఉన్న పోస్టాఫీసు దాదాపు 36 ఏళ్ల తర్వాత ఆంధ్రాబ్యాంక్ వీధిలోకి మార్చారు. ఈ నూతన ప్రారంభ కార్యక్రమానికి రాజమహేంద్రవరం సూపరింటెండెంట్ కె.శేషారావు ముఖ్య అతిథిగా విచ్చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన కార్యాలయంలో పోస్టల్ సేవలు యథావిధిగా కొనసాగుతాయన్నారు. కేవీ నారాయణరావు, కొండపల్లి సూర్యనారాయణ పర్యవేక్షణలో నూతన కార్యాలయం రూపుదిద్దుకున్నందుకు వారిని అభినందించారు. అనంతరం భవనం యజమాని అద్దేపల్లి మాణిక్యాలరావు దంపతుల చేతుల మీదుగా సూపరింటెండెంట్‌ను శాలువాతో సత్కరించారు. రామచంద్రపురం పోస్ట్ మాస్టర్ ఎస్.శ్రీనివాసరెడ్డి, ఎల్‌వీ నాగేంద్ర బాబు, జి.శివయ్య, ఎండీఎం షరీఫ్, కె.ఈశ్వరరావు, జి.వెంకటరావు, సీహెచ్ శ్రీనివాస్, ఎస్.దుర్గాదేవి, ఎం.అనుష, రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు టి.పుల్లేశ్వరరావు , మెస్సియావాయిస్ ఎడిటర్ ఇజ్రాయేలు రాజు పాల్గొన్నారు.

ఘనంగా అన్నసమారాధన

కాజులూరు: మండలంలోని మొగలిపాలెం గ్రామస్తులు సోమవారం భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని కనకదుర్గమ్మ ఆలయ వద్ద ఇటీవల దేవీనవరాత్ర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో అమ్మవారికి వచ్చిన విరాళాలకు తోడు పలువురి దాతల సహకారంతో ఈ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పరిసర గ్రామాలకు చెందిన సుమారు వెయ్యి మంది భక్తులు ఈ అన్నసమారాధనల్లో పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు.

వ్యక్తిగత స్వార్థం కోసమే పార్టీ ఫిరాయింపులు


బాపిరాజు


షేక్ అలీఖాన్ బాబా

మండపేట: వైఎస్సార్ సీపీ గుర్తుతోను, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కృషితోను గత మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్‌గా గెలిచి ఇప్పుడు వ్యక్తి గత స్వార్థాల కోసం పార్టీ ఫిరాయింపులు జరపడం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు అన్నారు. సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఇటీవల టీడీపీలోకి వెళ్లిన కౌన్సిలర్లు అందరూ తమ సొంత లాభం కోసం చేరారని ఆరోపించారు. అంతేగానీ వార్డు ప్రజల కోసం కాదన్నారు. ఈ విధంగా వ్యవహరించడం ఓట్లు వేసి గెలిపించిన ప్రజలను మోసగించడమే అవుతుందని విమర్శించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అండదండలతో చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి కోట్లాది రూపాయలతో పట్టణాన్ని అభివృద్ధి బాట పట్టించారన్నారు. వార్డుల్లో ఉండే ఎన్నో సమస్యలను పరిష్కరించారన్నారు. ఇవేమీ పట్టించుకోకుండా పార్టీలు జంప్ చేసిన వారిని ప్రజలు నమ్మే పరిస్థితి ఉండదని ఎద్దేవా చేశారు. స్వప్రయోజనాల కోసం వెళ్లిన వారికి రాజకీయంగా రానున్న రోజుల్లో ఉనికి కోల్పోవడం ఖాయమన్నారు. పార్టీ మారాలనుకున్న వారు తమ పదువులను రాజీనామాలు చేసి వెళ్తే వారి గొప్పతనం తెలుస్తుందని దయ్యబట్టారు. పదవులను అడ్డం పెట్టుకొని పార్టీలు మారే సంస్కృతి వల్ల రాజకీయంగా ప్రజలకు తప్పుడు సంకేతాలు పంపడమేనని ఆయన అన్నారు.

సొంత ప్రయోజనాల కోసమే..

సొంత ప్రయోజనాల కోసం వైఎస్సార్ కౌన్సిలర్లు పార్టీని వీడి టీడీపీలో చేరుతున్నారని, అభివృద్ధిని చూసి కాదని షేక్ అండ్ షేక్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ అలీఖాన్ బాబా అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల పార్టీ మారి టీడీపీలో చేరిన కౌన్సిలర్‌లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డు అభివృద్ధి కోసం టీడీపీలో చేరుతున్నామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఏరుదాటాక తెప్ప తగలేసిన చందంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో అరాచకం రాజ్యమేలుతోందే తప్ప చేసిన అభివృద్ధి లేదని మండిపడ్డారు. ఈ నాలుగు నెలల కాలంలో కూటమి ప్రభుత్వం ఉద్ధరించేదేముందో చెప్పాలన్నారు. తమ నాయకుడు మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ కార్యక్రమాలను కొండెక్కించారని విమర్శించారు. చిన్నారులపై అఘాయిత్యాలు జరుగుతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తోందని తూర్పార పట్టారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సహాయ సహకారాలతో ఆయా వార్డుల్లో రోడ్లు, డ్రైన్లు, కమ్యూనిటీ భవనాలు నిర్మాణానికి నిధులు పుష్కలంగా అందాయని ఆయన జ్ఞప్తికి తెచ్చారు. స్వప్రయోజనాల కోసం పార్టీ వీడిన వారి వల్ల తమ పార్టీకి ఎలాంటి ప్రయోజనం లేదని పేర్కొన్నారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని ఆయన అన్నారు.

నాటుకోడికి పెరుగుతున్న ఆదరణ

- పెంపకంతో మహిళలకు అదనపు ఆదాయం
- రానున్న సంక్రాంతి నేపథ్యంలో పెరిగిన పెంపకం

రాయవరం: మాంసాహార ప్రియులకు నాటుకోడి మాంసం అంటే లొట్టలేసుకుని మరీ తింటారు. ధర అధికమైనప్పటికీ ఇటీవల నాటుకోడికి మరింత డిమాండ్ పెరిగింది. ఫౌల్ట్రీలు పెరగడం.. మార్కెట్లో చికెన్ విరివిగా దొరుకుతున్నప్పటికీ నాటుకోడికి ఉన్న డిమాండ్ వేరుగా ఉంటుంది. సంక్రాంతి సమయంలో ఇంటికి వచ్చే అతిథులు, కొత్త అల్లుళ్లకు నాటుకోడి కూర వండి పెట్టాలని అందరూ భావిస్తారు. ఇటీవల నాటుకోళ్ల పెంపకం కూడా బాగా పెరిగింది. మరో రెండు నెలల్లో సంక్రాంతి రానున్న నేపథ్యంలో నాటుకోళ్లకు డిమాండ్ పుంజుకోనుంది.

గుడ్లు పెట్టే సామర్థ్యం ఎక్కువ

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మంచి పోషక విలువలు కలిగిన పౌష్టికాహారం అందించేవి పెరటి(నాటుకోళ్లు) మాత్రమే. నాటుకోళ్లకు గుడ్లు పెట్టే సామర్థ్యం, మాంసం ఉత్పత్తి తక్కువగా ఉంటుంది. కాని వీటి ధర మాత్రం ఎక్కువగా ఉంటుంది. నాటుకోళ్లు పెంచడానికి ప్రత్యేక వసతి, యంత్రసామగ్రి అవసరం లేదు. ఇవి మిగులు పదార్థాలు, గింజలు, చిన్న గడ్డిపరకలు, పొట్టు, క్రిమికీటకాలను తిని పెరుగుతాయి. నాటుకోడి సంవత్సరానికి 100 నుంచి 120 గుడ్లు పెడుతుంది. గుడ్డు మార్కెట్‌లో రూ.25 నుంచి 30 పలుకుతోంది. ఒక నాటు కోడి పెట్ట నుంచి ఏడాదికి రూ.2500 వరకు లాభం పొందే అవకాశం ఉంది. వీటి పోషణకు ప్రత్యేక ఖర్చు అవసరం లేదు. పెరటికోళ్లకు ముఖ్యంగా అజొల్లాను మేతగా వాడుకోవచ్చు.

నాటుకోడి మాంసానికి డిమాండ్

నాటుకోడి మాంసానికి ఇటీవల డిమాండ్ బాగా పెరిగింది. ముఖ్యంగా ఆదివారం నాటుకోడి మాంసానికి డిమాండ్ ఉండడంతో మాంసం దుకాణాల వద్ద ప్రత్యేకంగా అమ్మకాలు చేస్తున్నారు. కిలో మేక మాంసం రూ.800 ఉండగా, కిలో నాటుకోడి మాంసం రూ.1,200 ఉంది. పర్వదినాలు, ప్రత్యేక కార్యక్రమాల్లో మాంసాహార ప్రియులు నాటుకోడి మాంసానికి ప్రాధాన్యతమిస్తున్నారు. కేజీన్నర మాంసం వచ్చే నాటుకోడి(పెట్ట) ధర సుమారుగా రూ.1,200 నుంచి రూ.1,500 వరకు ఉండగా, అదే పుంజు అయితే రూ.2 వేల వరకు ఉంటుంది.


ఇళ్ల వద్ద పెరుగుతున్న నాటుకోళ్లు